రాజన్న దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కాన్గల్ దుబ్బ రాజేశ్వరాలయంలో పూజలు చేస్తున్న బక్కి వెంకటయ్య

తొగుట, ఫిబ్రవరి 27: రాజన్న దయతో ప్రజలంతా పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. మండలంలోని కాన్గల్‌లో నిర్వహించిన దుబ్బ రాజేశ్వర స్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తోపాటు దుబ్బాక సొసైటీ చైర్మన్ శేర్ల కైలాసం, మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, నాయకులు జన్నారెడ్డి, సూతారి రమేశ్ లను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ దోమల కొమురయ్య, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ప్రేమలాచంద్రారెడ్డి, మధారం మల్లయ్య, శ్రీధర్, కర్ణాకర్, బాలరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధితుడిని పరామర్శిస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 27: అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామానికి చెందిన ఎండీ అజిమొద్దీన్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బాధితుడిని పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అయితం శ్రీనివాస్, నాయకులు నర్సింహులు గౌడ్, రంజిత్, నగేశ్, బాలాచారి, మహేశ్, అనీల్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు అన్నపూజోత్సవం, ఏకాదశ రుద్రాభిషేకం

చేర్యాల, ఫిబ్రవరి 27: మహా శివరాత్రి సందర్భంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పెద్దపట్నం కార్యక్రమాన్ని ఆలయ వర్గాలు వైభవంగా నిర్వహించాయి. గురువారం మల్లన్న ఆలయంలో అర్చకులు స్వామి వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో పరమ పవిత్రంగా అన్నపూజోత్సవంతో పాటు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

రాయపోల్‌లో ఉమాపార్థివేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

గురువన్నపేటలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాయపోల్, ఫిబ్రవరి 27: రాయపోల్‌లోని దేవునిచెరువు పక్కన భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఉమాపార్థివేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు ఎదుర్కోళ్లు, 10 గంటలకు శివపార్వతుల కల్యాణాన్ని పౌరాణిక వేత్త మామిడి బాల్‌రెడ్డి దంపతులు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పురోహితులు వెంకటేశ్వర శర్మ, జంగం మాణిక్య ప్రభు భక్తులకు మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు.

గురువన్నపేటలో...

కొమురవెల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని గురువన్నపేట భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. శివపార్వుతుల ఉత్సహ విగ్రహాలను గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం లింగోద్భవ కాలంలో పరమేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. జాగరణ కోసం వచ్చిన భక్తులకు ట్రస్ట్ సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామలింగేశ్వర స్వామి ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 27: ఉమ్మడి మద్దూరు మండలంలోని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎండిన పంటలను కాపాడుకునేందుకు చెరువులు, కుంటలను నింపాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటాలు చేస్తామన్నారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి ఎండీ షఫీక్, నాయకులు మల్లారెడ్డి, జక్కుల ఎల్లయ్య, నారదాసు కనకయ్య ఉన్నారు.

ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధం

రాయపోల్, ఫిబ్రవరి 27: ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని పెద్దఆరెపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంపల్లి శంకరయ్య భార్యాపిల్లలతో కలిసి పెంకుటింట్లో నివాసిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా రాత్రి ఇంట్లో దీపాలు వెలిగించి ఆరుబయట కూర్చున్నారు. ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగగా, చుట్టుపక్కలవారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రమాదంలో వంట సామగ్రి, బట్టలు, నగదు, బియ్యం కాలిపోయాయి. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబలో పండుగపూట తీవ్ర విషాదం నెలకొంది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ మాల్లాగౌడ్, గ్రామస్తులు కోరారు.

కనుల పండువగా మల్లికార్జున భ్రమరాంబల కల్యాణం

మర్కూక్, ఫిబ్రవరి 27: మండలంలోని నర్సన్నపేట చేబర్తి గ్రామాల మధ్య వెలసిన మల్లికార్జున భ్రమరాంబల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. గురువారం యాదవసంఘం ఆధ్వర్యంలో వైభవంగా శివరాత్రి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అగ్నిగుండాలు, మల్లన్న స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యాదవసంఘం నాయకులు ప్రతాప్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మల్లికార్జున స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలన్నారు. ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం, మాధవీరాజిరెడ్డి, పర్వతాలు, మల్లేశం, మధుసూదన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నిత్యజీవితంలో యోగా భాగం కావాలి

యోగా చేస్తున్న మహిళలు

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 27: నిత్య జీవితంలో యోగా భాగంకావాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని ధర్మవీర యోగా శిక్షణాలయంలో ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మానసిక, శారీరక దృఢత్వం కోసం నిత్యం యోగా సాధన చేయాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉంటే ఇంటిని, కుటుంబాన్ని చక్కగా చూసుకోగలుగుతామనే విషయాన్ని గుర్తించాలన్నారు. తక్కువ కాలంలోనే యోగా శిక్షణతో పలువురు ఆరోగ్యవంతులు కావడం అభినందనీయమని మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్, యోగా శిక్షకురాలు అయిలేని అనిత అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సతీమణి మంజుల, ఎంఈవో మనీల, మాజీ కౌన్సిలర్లు బోజు రమ, వాల సుప్రజా, దొడ్డి శ్రీనివాస్, చిత్తారి పద్మతోపాటు పందిల్ల శంకర్, కొత్తపల్లి అశోక్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రజ్ఞాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు

కేసీఆర్‌కు ఆహ్వానం

గజ్వేల్/మర్కూక్, ఫిబ్రవరి 27: గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో మార్చి 3 నుంచి నిర్వహించే త్రిశక్తి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ముదిరాజ్ కులస్తులు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజేశ్వర్ రావు, మాజీ కౌన్సిలర్ వరలక్ష్మీకనకయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సురేశ్, ఎల్లేశ్, శ్రీనివాస్, కల్యాణ్, కృష్ణ, వెంకట్, దేవేందర్ పాల్గొన్నారు. మర్కూక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో నిర్వహించే ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ ఆలయ కమిటీ ప్రతినిధులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అంగడికిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీరాములు గౌడ్, దేవాయల కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్ ఆహ్వాన పత్రికను అందజేశారు.

కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అంగడికిష్టాపూర్ ఆలయ కమిటీ ప్రతినిధులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 94శాతం పోలింగ్

గజ్వేల్, ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో ఒక ఉపాధ్యాయ, నాలుగు పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులు బారులుదీరారు. సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మర్కూక్ మండల కేంద్రంలో నేషనల్ నవక్రాంతి పార్టీ అభ్యర్థి సిలివేరు ఇంద్రగౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూర్, ఫిబ్రవరి 27: జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుహక్కు చిన్నకోడూరులో వినియోగించుకున్నారు. గొర్రెల పెంపకందారుల సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ శ్రీహరి యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండం వనితారవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు ఉమేశ్‌చంద్ర, పద్మాగోవిందగిరి స్వామి యాదవ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్ తదితరులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

94శాతం పోలింగ్ నమోదు

చేర్యాల, ఫిబ్రవరి 27: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండల కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నాలుగు మండలాల్లో 94 శాతం పోలింగ్ నమోదైంది. చేర్యాలలో 124 ఓటర్లకు 117మంది, కొమురవెల్లిలో ఆరుగురు ఓటర్లకు ఐదుగురు, మద్దూరులో 28 మందికి 27మంది ఓటర్లు, ధూళిమిట్టలో 8 మంది ఓటర్లకు ఏడుగురు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేర్యాలలో పోలింగ్ సరళిని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పరిశీలించారు. మద్దూరులో పోలింగ్ కేంద్రాన్ని డీఆర్వో నాగరాజమ్మ సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటేసిన ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, ఫిబ్రవరి 27: దుబ్బాకలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. దుబ్బాక పట్టణంలో కేసీఆర్ పాఠశాల(ప్రభుత్వ ఉన్నత పాఠశాల)లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో 2174 మంది పట్టభద్రులకు 1419 మంది (65.31 శాతం), 196 మంది ఉపాధ్యాయులకు 186 మంది (94.89 శాతం) పోలింగ్ జరిగిందని అధికారులు వెల్లడించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలకేంద్రంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మిరుదొడ్డిలో 635 మంది పట్టభద్రుడుగా 459 మంది, 28 టీచర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండలంలో 672 మంది పట్టభద్రులకు 492 మంది ఓట్లు హక్కును వినియోగించుకున్నారు.

హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నాలుగు మండలాల పరిధిలో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ పోలింగ్ 74.36శాతం కాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 94.13శాతం అయింది. గ్రాడ్యుయేట్ ఓట్లు 7,079 ఉండగా ఇందులో 5,264 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఎన్నికల ఓట్లు 341 ఉండగా ఇందులో 321 ఓట్లు పోలయ్యాయి. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీసమేతంగా హుస్నాబాద్ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

జగదేవపూర్‌లో...

జగదేవపూర్, ఫిబ్రవరి 27: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీకి జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. టీచర్ ఎమ్మెల్సీ 50 ఓట్లకు 49 ఓట్లు పోలయ్యాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 974 ఓటర్లు ఉండగా 742 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాయపోల్‌లో...

రాయపోల్, ఫిబ్రవరి 27 :పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 560 మంది పట్టభద్రులు ఉండగా 414మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు, టీచర్ ఎమ్మెల్సీ 19 ఓట్లు ఉండగా 17 మంది ఓటు వేశారు.

కోహెడలో...

కోహెడ, ఫిబ్రవరి 27: ఉన్నత పాఠశాలలో జరిగిన పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉపాధ్యాయుల విభాగంలో 62మందిలో 61 మంది ఓటు వేశారు.98.38శాతం పోలింగ్ నమోదైంది. 1522 మంది పట్టభద్రుల్లో 1125 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 73.9శాతం ఓటింగ్ నమోదు అయింది.

గజ్వేల్: గజ్వేల్‌లో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

చేర్యాలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

చిన్నకోడూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ

సిద్దిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించున్న బీఆర్ఎస్ యువ నాయకుడు వంగా రాజేశ్వర్‌రెడ్డి

దుబ్బాకలో ఓటుహక్కు వినియోగించుకున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గన్నే వనితారెడ్డి, తదితరులు

మిరుదొడ్డి: భూంపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్: గజ్వేల్‌లో ఓటు వేసిన పట్టభద్రులు

హుస్నాబాద్‌లో ఓటు వేసిన అనంతరం మంత్రి పొన్నం, ఆయన సతీమణి మంజుల

వర్గల్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న పట్టభద్రులు

కోహెడ: పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేఖ, డీఈ రాజేందర్ తదితరులు

హుస్నాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు

జగదేవపూర్‌లో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

ధూళిమిట్టలో పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను తీసుకెళ్తున్న పోలింగ్ అధికారులు, పోలీసులు

బెజ్జంకిలో ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

హుస్నాబాద్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు బారులుదీరిన పట్టభద్రులు

కోహెడ: పోలింగ్ బూత్ ఎదుట బారులుదీరిన పట్టభద్రులు

తొగుట: ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు

దౌల్తాబాద్: ఎన్నికల విధుల్లో పోలీసు అధికారులు

నేటి నుంచి పుస్తక ప్రదర్శన

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 27: సిద్దిపేట ప్రభుత్వ మల్టీపర్పస్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సంచార పుస్తక ప్రదర్శనశాలను ప్రారంభిస్తారని నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా దక్షిణ భారత ఇన్‌చార్జి డాక్టర్ పత్తిపాక మోహన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంచార పుస్తక ప్రదర్శనను నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సంచార పుస్తక ప్రదర్శనను సిద్దిపేట లోని వివిధ కూడళ్లతోపాటుగా కళాశాలలు, పాఠశాలల్లో ఏర్పాటు చేస్తుందన్నారు. సంచార పుస్తక ప్రదర్శన ఈనెల 28 నుంచి మార్చి 2 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఐతా చంద్రయ్య, అశోక్, ఉమాదేవి, జంగిటి శాంతకుమార్, ఉండాళ్ల రాజేశం పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

బెజ్జంకి, ఫిబ్రవరి 27: కాంట్రాక్టర్‌పై చర్య లు తీసుకోవాలని తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బామండ్ల రవీందర్ అన్నారు. గురువారం నాడాయన విలేకరులతో మాట్లాడుతూ... ఇటీవల మండలంలోని తోటపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారన్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రారంభానికి ముందే పగుళ్లు వచ్చాయని ఆరోపించారు. కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులపై పూర్తిస్థాయిలో విచారణ చేసి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 27: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సిద్దిపేట సర్కిల్ పరిధిలో గురువారం నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మంది పట్టుబడ్డారన్నారు. వారిని న్యాయమూర్తి కాంతారావు ఎదుట హాజరుపర్చగా, విచారణ జరిపిన న్యాయమూర్తి మందుబాబులకు రూ.16 వేలు జరిమానా విధించారని వివరించారు.